హిమాలయాల కన్నా డైనోసర్ల కన్నా ఎంతో పురాతనమైనది 'దక్కన్' శిలా సంపద. ఈ ప్రాంతం నుంచి ఒక 'కోహినూర్'ను తీసుకుపోతేనేం... 'అదర్ కోహినూర్స్' ఎన్నో ఉన్నాయిక్కడ. అవే హైదరాబాద్‌ను ఒక విశిష్టమైన, విలక్షణమైన ప్రాంతంగా తీర్చిదిద్దాయి. వెలకట్టలేని గుట్టలు, బండలు ఈ ప్రాంత చరిత్రకు సాక్ష్యాలు. 'ఈ నల్లని రాళ్లలో... ఏ కన్నులు దాగెనో... ఈ బండల మాటున ఏ గుండెలు మోగెనో...' అన్నట్టుగా వాటిలోని సవ్వడిని, అలజడిని జాగ్రత్తగా ఒడిసి పట్టుకున్నారు హైదరాబాద్ ప్రేమికురాలు, ఫిల్మ్‌మేకర్ ఉమా మగల్. 'దక్కన్' సంస్కృతిని మేళవించి ఆమె రూపొందించిన 'అదర్ కోహినూర్స్' డాక్యుమెంటరీ... నగరానికి ఆమె రాసిన ఒక చూడ చక్కని ప్రేమలేఖ.

# ఈ నల్లని రాళ్లలో...




ఒక ఆదివారం... ఉదయమే 'నౌబద్ పహాడ్'కు కూతవేటు దూరంలోని ప్రసాద్ ఐమాక్స్‌లో 'అదర్ కోహినూర్స్' డాక్యుమెంటరీ ప్రదర్శన. సాధారణంగా డాక్యుమెంటరీలను ఎవరూ అంతగా ఇష్టపడరు. కానీ ఆ రోజు మాత్రం థియేటర్ సీట్లన్నీ పెద్దలు, పిల్లలతో నిండిపోయాయి. సీట్లు సరిపోక చాలామంది మెట్లపైనే కూర్చున్నారు. థియేటర్ లోపలకు వెళ్లే రెండు ద్వారాల దగ్గర కూడా నిలబడే సుమారు గంటపాటు సాగిన 'అదర్ కోహినూర్స్'ను కళ్లార్పకుండా చూశారంతా. 'కరోనా అనంతరం ఇంతమంది జనాలు రావడం కమర్షియల్ సినిమాకు కూడా చూడలేదు. హౌస్‌ఫుల్ అయ్యిందంటే వండర్‌ఫుల్' అని డాక్యుమెంటరీని పూర్తిగా చూసిన ప్రసాద్ ఐమాక్స్ అధినేత రమేశ్ ప్రసాద్ ఆశ్చర్యపోయారు. ప్రదర్శన పూర్తవ్వగానే దర్శకురాలు ఉమా మగల్, ఆమె టీమ్‌ను అభినందిస్తూ స్టాండింగ్ ఓవేషన్ లభించింది. కదలని బండరాళ్ల గురించి తీసిన ఓ డాక్యుమెంటరీ అంతమందిని ఇంతగా కదిలించిందంటే... సమ్‌థింగ్ స్పెషలే కదా!

**ఫ్యూజన్‌తో ఈ తరానికి అర్థమయ్యేలా...**

ఒకప్పటి హైదరాబాద్ మొత్తం రాళ్లమయమే. ఎక్కడ చూసినా బండలు, గుట్టలే. అంతెందుకు నగరంలోని చాలాప్రాంతాల పేర్లు కూడా రాళ్లతో ముడిపడి ఉన్నవే. పంజాగుట్ట, చాంద్రాయణగుట్ట, అడ్డగుట్ట, పార్సీగుట్ట, కీసర గుట్ట... గోల్కొండ, బోరబండ, ఫిసల్ బండ, శాలిబండ, రామేశ్వరం బండ, నామాల గుండు... కొండాపూర్, మణికొండ... బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రెడ్ హిల్స్... ఇలా ఒకటా రెండా హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల పేర్లు అన్నీ కూడా రాళ్లతో ముడిపడినవే. ఈ బండలతో, రాళ్లతో ఇక్కడి సంస్కృతి పెనవేసుకుని ఉంది. ఈ ప్రాంతపు ప్రతీ 'దక్కనీ' సృజనలో అవి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. చిత్రకళ, శిల్పకళ, సంగీతం, నాటకం, వస్త్రాలు, ఇతర కళాకృతులు ఏవైనా వాటిలో శిలాసంపద దర్శనమివ్వాల్సిందే. తరతరాలుగా ఇక్కడి కళాకారులను హైదరాబాద్‌లోని బండలు, గుట్టలు సేదతీర్చాయి. వారిలో సృజనను రగిలించాయి. ఈ ఎరుకనే సృజనాత్మకంగా డాక్యుమెంటరీ చేశారు ఉమా మగల్. ఒకప్పటి హైదరాబాద్ శిలా సంపదను ఈ తరానికి అర్థమయ్యేలా ఫ్యూజన్ బాటను ఎంచుకుని, డాక్యుమెంటరీని వివిధ భాషలతో కూడిన లోకల్ పాప్, రాప్‌ల సమ్మిళితంగా తెరకెక్కించారు. కొన్ని వేల ఏళ్ల క్రితం శిలారూపం ఎలా ఏర్పడిందో సైంటిఫిక్‌గా చూపుతూనే ప్రేక్షకులు హుషారుగా హైదరాబాద్‌లోకి అడుగుపెట్టేలా చేశారు. రాప్ సాంగ్‌ను నేపథ్యంగా వాడుకుంటూ నగరాన్ని పరిచయం చేయడం తెలివైన స్క్రీన్‌ప్లే.

## వేదనే వేడుకగా...

తను ఒకప్పుడు తిరగాడిన ప్రాంతం. అమెరికాకు వెళ్లి తిరిగొచ్చిన తర్వాత చాలా వ్యత్యాసం. కాంక్రీట్ జంగిల్‌లో తరిగిపోయిన, కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు ఫిల్మ్‌మేకర్ ఉమా మగల్‌కు నిద్రలేకుండా చేశాయి. పాత స్నేహితురాలు, హైదరాబాద్‌వాసి అయిన మహనూర్ యార్‌ఖాన్ వద్ద తన బాధను వ్యక్తం చేశారు. వారిద్దరికీ రాళ్లపై పెరిగిన జ్ఞాపకాలు, వాటిపై ఉన్న ప్రేమ 'అదర్ కోహినూర్స్' డాక్యుమెంటరీకి ప్రేరేపించాయి. ఉమ సొంతంగా ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకుని, హైదరాబాద్‌లోని బండలు, గుట్టలు ఎక్కుతూ అత్యంత వ్యయ ప్రయాసలకు ఓర్చి, సొంత నిధులతో సృజనాత్మకంగా ఈ డాక్యుమెంటరీని దృశ్యకావ్యంగా తీర్చిదిద్దారు.



రాళ్లు, కొండలు, గుట్టల చుట్టూ అల్లుకున్న జీవితాలను, కళలనే కాదు... పురాణాలనూ ఆమె స్పృశించారు. హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా కనిపించే ఎల్లమ్మ, రేణుకమ్మ దేవతాగుళ్లకు రాళ్లకు ఉన్న చరిత్రను బొమ్మల రూపకంగా మలిచారు. సుల్తానుల రాజసాన్ని కళ్లకు కట్టారు. ఇక్కడి కళలను, సంగీతాన్ని, కళారూపాలను... అన్నింటినీ తెరపై చూపుతూనే తెలుగు సినిమా పాటలు, ఉర్దూ షాయరీలు, రాప్ సంగీతాన్ని మేళవించారు. దాంతో 'అదర్ కోహినూర్స్' డాక్యుమెంటరీ 'దక్కన్' పీఠభూమిలో రేసుగుర్రంలా పరుగెత్తింది. ఇక్కడి కొండలు, గుట్టలపై ప్రేమపుట్టేలా చేశారు. మరోవైపు అభివృద్ధి పేరిట కొండలు పిండికావడం గుండెల్ని పిండేసే ఒకానొక విషాద సన్నివేశం. 'చెట్లను కొట్టేస్తే మళ్లీ పెంచుకోవచ్చు... కానీ రాళ్లు అలా కాదు... వాటిని పెంచలేం... కేవలం రక్షించుకోవాల్సిందే' అనే సందేశం అంతర్లీనంగా పెద్దలకే కాదు, ఈ తరం పిల్లలకు కూడా అర్థమవుతుంది. పర్యావరణం పట్ల పాలకులకు ఒక హెచ్చరికను జారీ చేస్తుంది. దక్కన్ పీఠభూమి శిలలు ప్రపంచంలోనే అతి పురాతనమైనవి. శిలలను ప్రాకృతిక వారసత్వంగా పరిరక్షించే ఏకైక నగరం కూడా మనదే కావడం ఈ నగరవాసుల పెదవులపై కాస్త చిరునవ్వును పూయించినా... కాంక్రీట్ జంగిల్‌లో కనుమరుగవుతోన్న వాటిని కాపాడుకోవాల్సిన కర్తవ్యం అందరిపై ఉందనే సామాజిక సూత్రం ఈ విలువైన 'అదర్ కోహినూర్స్'ను చూస్తే అర్థమవుతుంది.

- చల్లా




